

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### మాట్లాడని మల్లెమొగ్గ

**కాలింగ్ బెల్ శబ్దానికి తలుపు తీసిన విదుషి** బయట నిలబడి ఉన్న కిరీటిని చూసి కొద్దిగా పక్కకి తప్పుకుని చెప్పింది.

"రండి. రండి. చాలారోజులైంది మీరు కనబడి"

"ఎక్కడండీ తీరడం లేదు. సాగర్ ఉన్నాడా?" సోఫాలో కూర్చుంటూ అడిగాడు కిరీటి.

"లేరు బ్రాంచ్ ఇన్స్పెక్షన్కి గుంటూరు వెళ్ళారు."

"అయితే మళ్ళీ వస్తాను" ఇబ్బందిగా చెప్పాడు కిరీటి.

"అయ్యో! అంతదూరం నుంచి వచ్చారు ఉండండి కాఫీ తాగి వెళ్దురు గాని." చెప్పింది విదుషి.

"పర్లేదండి. ఎక్కడికీ వెళ్ళడనే ధైర్యంతో ఫోన్ కూడా చేయకుండా వచ్చాను. ఇంకోసారి వచ్చినప్పుడు తాగుతాను కాఫీ."

"ఒక్క నిమిషం"

వంటగదిలోకి వెళ్ళిన విదుషి రెండు చేతులతో రెండు పకోడీ ప్లేట్లతో వచ్చి వాటిని టీపాయ్ మీద పెట్టి వెళ్ళి రెండుగ్లాసుల మంచి నీళ్ళతో వచ్చి చెప్పింది.

"తీసుకోండి"

"ఇప్పుడెందుకండీ ఇవన్నీ" మొహమాటంగా ప్లేట్ అందుకున్నాడు కిరీటి.

"మీరు రంగనాయకమ్మగారి 'స్వీట్ హోం' చదివారా?" అడిగింది విదుషి.

"ఎప్పుడో చిన్నప్పుడు చదివాను గుర్తులేదు ఏం?" ఆసక్తిగా అడిగాడు కిరీటి.

"అందులో బుచ్చిబాబు విమలతో అంటాడు 'మీ ఆడవాళ్ళెంత అదృష్టవంతులు. ఎప్పుడు తినాలనిపిస్తే అప్పుడు ఎంచక్కా వంటగదిలోకి వెళ్ళి మైసూర్ పాక్ వండుకుంటారు' అని. అట్లాగే వెదర్ బావుంది. పకోడీలు తినాలి అనిపించింది. సాగర్ వచ్చాక

ఇంకోసారి చేయచ్చు అని ఇప్పుడే వండాను. మీరొచ్చారు. ఒక్కదన్నే తింటే బావుండదు. ఇద్దరం కబుర్లు చెప్పుకుంటూ తినచ్చు. చెప్పండి. ప్రజ్ఞ ఎలా ఉంది?" సోఫాలో విశ్రాంతిగా కూర్చుని ప్లేట్‌లోని పకోడీ అందుకుంటూ అడిగింది విదుషి.

"బావుంది. పిల్లలు సెలవులకి వాళ్ళ అమ్మమ్మగారి ఊరెళ్ళారు. మీ వాళ్ళు కనిపించడంలేదు?"

"వాళ్ళు స్కూల్ ఎక్స్‌కర్షన్‌కి కేరళ వెళ్ళారు. ప్రస్తుతం మా ఇంటికి నేనే మహారాణిని" నవ్వింది.

"మీరు పుస్తకాలు బాగా చదువుతారనుకుంటా?"

"అవును. ఏం?"

"ఏం లేదు. మీ భాష వెరైటీగా ఉంది. అందుకని" నవ్వాడు కిరీటీ.

ఆ సంభాషణ అలా కొనసాగి సాగి సమయం ఎంతయిందో కూడా వాళ్ళు గమనించలేదు. మధ్యలో ఓసారి విదుషి లోపలికి వెళ్ళి కాఫీ తీసుకొచ్చింది. ఖాళీ కాఫీ కప్పుని టీపాయ్ మీద పెడుతూ టైం చూసిన కిరీటి ఉలిక్కిపడి లేచి చెప్పాడు.

"అమ్మో! తొమ్మిది దాటింది. వెళ్తాను. ప్రజ్ఞ ఒక్కతే ఉంది ఇంట్లో"

"ఈ సారి మీరు వచ్చేప్పుడు తననీ తీసుకురండి. సాగర్ వచ్చాక ఫోన్ చేయిస్తాను. డిన్నర్‌కి వచ్చేయండి." తనూ లేస్తూ చెప్పింది విదుషి.

●●●

తలుపు తీసిన ప్రజ్ఞ భర్తని చూసి చిరునవ్వుతో చెప్పింది.

"ఏంటీ మీ స్నేహితుడు పదైనా వదల్లేదా?"

"అంత కష్టపడి వెళ్ళానా? వాడు లేడు. గుంటూరు వెళ్ళారట."

"మరి ఫోన్ చేసి వెళ్ళొచ్చుకదా? ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పుడు వినియోగించుకోకపోతే ఎలా? నాకు కాల్ చేసి సాగర్ ఇంటికి వెళ్తున్నాను అని చెప్పినట్లే ఆయనకీ చేయచ్చుగా? ఇంతకీ ఇంతసేపు ఎక్కడున్నారు మరి?" అడిగింది.

"వాళ్ళింట్లోనే. ఏమో అనుకున్నాను కానీ ప్రజ్ఞా, విదుషి చాలా తెలివైన అమ్మాయి. అన్ని విషయాల్లో ఎంత నాలెడ్జ్ ఉందనుకున్నావు? తనతో మాట్లాడుతుంటే అసలు టైమ్ తెలీలేదు. సార్ధక నామధేయురాలనుకో. నీలాగే పుస్తకాల భాష మాట్లాడుతుంది." ప్రశంసగా చెప్పాడు కిరిటి.

"అవునండీ. నేను కూడా తనతో ఎప్పుడూ అదే చెప్తుంటాను. తను చాలా వినసొంపుగా మాట్లాడుతుంది. అస్సలు బోర్ అనిపించదు." భర్తతో ఏకీభవించింది ప్రజ్ఞ

"ఈ రోజు అన్నం తిన్లేను ప్రజ్ఞా. ఆవిడ పకోడీలు పెట్టి కాఫీ ఇచ్చింది. కొంచెం మంచినీళ్ళివ్వు. చాలు." దుస్తులు మార్చుకుంటూ చెప్పాడు కిరిటీ.

"కొంచెం మజ్జిగన్నం?"

"నా వల్లకాదు."

"సరే. నాకు ఆకలవుతోంది. ఇద్దరం తినచ్చుకదా అని వెయిట్ చేసాను. తినేసి వస్తా" వంటింట్లోకి నడిచింది ప్రజ్ఞ

●●●

ఇంటి తలుపు తీసి ఉండడం, బయట చెప్పులు చూసి ఎవరొచ్చారో అనుకుంటూ లోపలికి వచ్చిన కిరీటికి మిరపకాయ బజ్జీలు తింటూ ప్రజ్ఞతో కబుర్లు చెప్తున్న సాగర్ కనిపించాడు.

"గుంటూరు నుంచి ఎప్పుడొచ్చావు?" సాదరంగా మాట్లాడుతూ అతని పక్కన కూర్చున్నాడు కిరీటి.

"వారం దాటింది. ఇదుగో వద్దాం, అదిగో వద్దాం అనుకోవడమే కానీ తీరలేదు. చివరికి ఇవాళ కొంచెం టైం దొరికితే వచ్చాను. కాకపోతే నీ టైంకే నువ్వొచ్చావు. దాంతో రెండు గంటల నుంచి ప్రజ్ఞ టైం తినేస్తున్నాను." నవ్వుతూ చెప్పాడు సాగర్.

"టెక్నాలజీని ఉపయోగించడంలో మీ మిత్రుడే ఆయన. ఫోన్ చేయాలని తట్టలేదుట" మంచినీళ్ళగ్లాసుని కిరీటికి అందిస్తూ చెప్పింది ప్రజ్ఞ

"బాప్‌రే! ప్రజ్ఞ ఎంత ఇంటిలిజెంట్‌రా! నాకు ఇంతవరకూ తెలీలేదు. అమాయకంగా ఉండే ప్రజ్ఞని చూసి ఉత్తమ ఇల్లాలు అనుకున్నా కానీ ఎంత నాలెడ్జ్ ఉందనుకున్నావు? గుండు సూది నుంచి అణుబాంబుదాకా అన్ని విషయాల మీద ఎంత అథారిటీ ఉందో! నిజంగా సార్థక నామధేయులు అనుకో" ప్రశంసగా చెప్పాడు సాగర్.

"అంత తెలివైనదాన్నేం కాదండి. కాకపోతే చదివినవి గుర్తుండిపోయాయి అంతే" సిగ్గుగా చెప్పి లోపలికి వెళ్ళిపోయింది ప్రజ్ఞ

గంట తర్వాత సాగర్‌ని పంపించి లోపలికి వచ్చి తలుపేసి ప్రజ్ఞతో కఠినంగా చెప్పాడు కిరీటి.

"రెండు గంటలు వాడితో ఏం మాట్లాడావు అంత మెచ్చుకుంటున్నాడు?"

ఆ ప్రశ్నకి నిర్ఘాంతపోయింది ప్రజ్ఞ

"నీ తెలివితేటలకి నా ముందే సర్టిఫికెట్ ఇస్తున్నాడుగా?" వ్యంగ్యంగా చూస్తూ చెప్పాడు కిరీటీ.

"ఏవో పిచ్చాపాటీ కబుర్లు. మీరు వచ్చి వెళ్ళారని విదుషి చెప్పిందట. ఇప్పటికి తీరిక దొరికి వచ్చారుట" దుఃఖాన్ని అణుచుకుంటూ చెప్పింది ప్రజ్ఞ

"వస్తే? నేను లేట్‌గా వస్తానని చెప్పి పంపేయచ్చుగా? కూర్చో పెట్టి కాఫీ టిఫిన్లు ఇచ్చి మరీ కబుర్లు చెప్తున్నావు?" కోపంగా అరిచాడు కిరీటి.

"మీరు వాళ్ళింటికి వెళ్ళినప్పుడు విదుషి అలా చెప్పి మొహం మీద తలుపెయ్యకుండా లోపలకి పిలిచిందని మీరే చెప్పారుగా? మీరు ఊళ్ళోనే ఉన్నారు. వస్తారు కూర్చోమని చెప్పి మర్యాదలు చేయడం తప్పా?" ఉక్రోషంతో తనూ పెద్దగా అరిచి చెప్పింది ప్రజ్ఞ

"వాళ్ళావిడ అందరితో సోషల్‌గా మాట్లాడటం వాడికి ఇష్టమేమో కానీ, నాకు నువ్వలా ఉండటం ఇష్టంలేదు. అసలు నా స్నేహితులందర్నీ అన్నయ్య అని పిలవమని చెప్పాను. నా మాట ఎప్పుడు విన్నావు కనక నువ్వు?"

"చచ్చినా పిలవను. మా 'అన్నయ్య'ని తప్పించి ఎవర్నీ అలా పిలవను.

అన్న అనగానే చెల్లెలి ఫీలింగ్ వస్తుందా? రాదు తలుపు తీసి, డ్రాయింగ్ రూంలో కూర్చుని మాట్లాడినా మీ మనసుకి అంత తప్పుగా తోచినప్పుడు పరాయి భార్యతో రాత్రి పదింటిదాకా కబుర్లు చెప్పినప్పుడు తప్పు అనిపించలేదా?" కోపంగా నిలదీసింది ప్రజ్ఞ

"అది వాడికి ఇష్టం. నాకు లేదని చెప్పాను." రెట్టించాడు కిరీటి.

"అది ఆయన ఇష్టం కాదు. సంస్కారం. వాళ్ళింటికి వెళ్ళొచ్చి ఆవిడని నా ముందు అరగంట పొగిడారు. నేనూ మెచ్చుకున్నాను. ఎందుకంటే నేను మీ గురించి చెడుగా ఊహించను కాబట్టి, మీమీద నమ్మకం ఉంది కాబట్టి. నా దగ్గరకి వచ్చేసరికి నేను పైట నిండుగా కప్పుకుని 'వారు ఇంట్లో లేరు అన్నయ్యగారూ' అని చెప్పి మొహాన తలుపు వేయలేదని కోపం. మీ మగాళ్ళకి పరాయి భార్యలు తెలివిగా మాట్లాడుతూ, కాలం తెలీకుండా కబుర్లు చెప్తూ, కలివిడిగా ఉండాలి. భార్యలు మాత్రం మాట్లాడని మల్లెమొగ్గల్లా అమాయకంగా మీరేం చెప్పినా నమ్మేసి తలాడిస్తూ అసూర్యంపశ్యల్లా ఉండాలి. ఛీ!" తలుపు చప్పుడయ్యేలా వేస్తూ బెడ్ రూంలోకి వెళ్ళిపోయింది ప్రజ్ఞ

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*